# మంత్రిగారి తల్లి

— బుద్ధి యజ్ఞమూర్తి

“‘రామలక్ష్మి! ఏమిటే ఆ మైకు గొడవ. ఎవరో వస్తున్నారని చెప్తున్నాడు?” అడిగింది సరస్వతి.

“నీకు తెలీదా పెద్దమ్మా. మంత్రయినాక చెంగల్రెడ్డి అన్నయ్య మొదటిసారిగా మన వూరొస్తున్నాడు. అందుకే ఆ యేర్పాట్లన్నీ” చెప్పింది పక్కింటి రామలక్ష్మి.

“అట్లాగా” అని చిన్నగా గొణిగి ఇంకేమీ మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయింది సరస్వతి. చెంగల్రెడ్డి ఆమె కన్నకొడుకు. ఐనా ఆమె ముఖంలో సంతోష ఛాయలు కొంచెం కూడా లేవు. రామలక్ష్మికి పెద్దమ్మని తల్చుకుంటే దిగులూ, బాధా రెండూ కలిగాయి. సరస్వతిని చూస్తుంటే ఆమెకి అంతా కరిగిపోయి ఆఖర్న మిగిలిన కొవ్వొత్తి జ్ఞాపకం వొస్తుంది. ఆకులన్నీ రాలిపోయాక మిగిలిన మోడు చెట్టు జ్ఞాపకం వొస్తుంది. పెద్దకొడుకు ఇవాళ మంత్రి. ఐనా ఆ తల్లి కడుపు నింపుకోడం కోసం అరవైయేళ్ళ వయసులో జీడిపప్పు పొట్టు వొలుస్తూ బతుకీడుస్తోంది.



పాతికెకరాల పంట - చేతికొచ్చింది కళ్ళ ముందే వరదలకి కొట్టుకుపోతే చెంగల్రెడ్డి తండ్రి గుండెపోటుతో చచ్చిపోయాడు. థర్డ్‌ఫారం చదువుతున్నాడప్పుడు రెడ్డి. ముప్పై ఐదేళ్ళకే వితంతువయిన సరస్వతి మామూలు మనిషయ్యిందంటే అది పిల్లల వల్లనే. ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళని పెంచి పెద్దవాళ్ళని చెయ్యాలి. వాళ్ళని పోషించాలి. బాధనంతా గుండెలోనే దాచుకుని బాధ్యతల్ని స్వీకరించింది సరస్వతి.

బతకడం కోసం ఐదెకరాల పొలం అమ్మేసింది. పదెకరాలు కౌలుకిచ్చింది. మరిది శివారెడ్డి సాయంతో మిగతా పదెకరాల్లో తానే పంట వేయాలనుకున్నది. చెంగల్రెడ్డిని పొలం పనిలోకి పెట్టాలనుకున్నది. రెడ్డి చదువుకుంటానని మొండికేశాడు. ఒత్తిడి చేయలేకపోయింది కొడుకుని. నానా అగచాట్లూ పడింది అతడి చదువుకోసం. చిన్నకొడుకు వెంకటరెడ్డి హైస్కూలు చదువు అయినాక “ఇంక చదవను. పొలం పనులు చూసుకుంటా” అంటే సరేనంది. గవర్నమెంటు కాలేజీలో సీటురాని చెంగల్రెడ్డి ప్రైవేటు కాలేజీలో ఇంజనీరింగ్‌లో చేరాడు. డొనేషన్లకీ, ఖర్చులకీ, విలాసాలకీ ఐదెకరాల పొలం హరించి వేశాడు. పెళ్ళీడుకొచ్చిన ఇద్దరి కూతుళ్ళ పెళ్ళిళ్ళకి మిగతా ఐదెకరాలూ ఖర్చయిపోయాయి.

వెంకటరెడ్డిని తన చేతికిందే పెట్టుకుని శివారెడ్డి పదెకరాల్ని తన కాలు కిందే ఉంచుకున్నాడు. వదినకి తనకి తోచినంత ధాన్యం ఇస్తూ వచ్చాడు. ‘ఇంతేనా?’ అని సరస్వతి నోరు తెరచి అడగనూ లేదూ, ‘ఇంకా కావాలా?’ అని శివారెడ్డీ అడగలేదు.

ఎంతో కష్టం మీద ఇంజనీరింగ్ చదువు అయ్యిందనిపించాడు చెంగల్రెడ్డి. చదువు మీద కంటే రాజకీయాల మీద, కొట్లాటల మీద శ్రద్ధ ఎక్కువగా వుంటూ వచ్చింది అతడికి. ఇంటి వద్ద ‘బోర్’ అన్పించింది. తల్లి పడ్తున్న అవస్థలు బాధ కల్గించాల్సింది పోయి చీదర పుట్టించాయి. చదువు సాగేప్పుడు ఎంతడిగితే అంత డబ్బు అందేది. ఇప్పుడా స్థితి అగుపించలేదు. జేబులో డబ్బులు లేకుండా బజార్లోకి ఎట్లా వెళ్ళడమా అని దిగులుపడ్డాడు. మామూలుగా అయితే ఇవ్వదు తల్లి. ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టాలని అబద్ధం చెప్పి డబ్బులు తీసుకున్నాడు కొంతకాలం. తర్వాత అదీ బయటపడింది.

ఆ తర్వాత రాజకీయాల పేరుతో బలాదూర్‌గా తిరిగే గుంపులో చేరాడు. ప్రతిపక్ష పార్టీలో తిరుగుతూ అధికార పార్టీకి వ్యతిరేకంగా ఆ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొన్నాడు. నానా గొడవలూ, అల్లర్లూ చేసి పార్టీలోని పెద్ద నాయకుల దృష్టిలో పడ్డాడు. రాజకీయాల గొడవ మనకొద్దని సరస్వతి బతిమాలుకుంది కొడుకుని. అతడు వినకపోయేసరికి తల్లిగా కోపం తెచ్చుకుంది. ఆమెని కొట్టినంత పన్చేసి “నువ్వు నా తల్లివి కాదు, నేను నీ కొడుకుని కాదు” అన్చెప్పి ఇంట్లోంచి వొచ్చేశాడు. ‘వాడే వొస్తాడులే’ అని సరిపెట్టుకుంది సరస్వతి. కానీ కొడుకు మారడని ఆ తర్వాత తెలిసి వచ్చిందామెకి. పార్టీలో డబ్బు పుష్కలంగా ఉన్న సారా కంట్రాక్టర్ శిరోమణి దగ్గర చేరి అతడి కుడిభుజంగా తయారయ్యాడు చెంగల్రెడ్డి. శిరోమణికి డబ్బుంది, ధైర్యముంది కానీ ఉపన్యాసాలు చెప్పే నేర్పు మాత్రం లేదు. ఆ నేర్పు అతడికి చెంగల్రెడ్డిలో కనిపించింది. అందుకే అతణ్ణి చేరదీశాడు. శిరోమణి తననెందుకు చేరదీశాడో రెడ్డికీ తెలుసు. రాజకీయాల్లోని లోటుపాట్లన్నీ ఆకళింపు చేసుకున్నాడు కొద్దికాలంలోనే. పార్టీలో పంచాయతీ స్థాయి అధ్యక్షుడి నుంచి జిల్లా స్థాయి అధ్యక్షుడి దాకా ఎదిగాడు. తను చేరింది రాజకీయాల్లో ఐనా రాజకీయ పార్టీల్ని తెగనాడుతూ జనం దృష్టిని కూడా ఆకర్షించాడు.

“దేశంలో ‘రాజకీయ జాతి’ అనేదొకటి తయారయ్యింది. ఆ ‘జాతి’కి నీతీ, నియమం లేవు. తమ అధికారం, ఆస్తి పెంచుకోవడం, తమ బంధువుల శ్రేయస్సు ఇవే ముఖ్యంగా పెట్టుకుని ఎంతటి నీచత్వానికైనా పాల్పడటానికి ఆ ‘జాతి’ వెనుదీయడం లేదు’ అని సభల్లో మాట్లాడుతూ జనంచేత చప్పట్లు కొట్టించుకునేవాడు. తమ పార్టీ పేదల్లోంచి, పేదల కోసం పుట్టుకొచ్చిందని, అందుకు ఉదాహరణ తానేనని, ఆ రాజకీయ జాతిని మట్టుబెట్టడమే తమ పార్టీ లక్ష్యమనేవాడు.

అధికార పార్టీ చర్యకో, ఏ ప్రభుత్వాధికారి చర్యకో వ్యతిరేకతంగా ధర్నానో, రాస్తారోకోనో, నిరసన ప్రదర్శనో నిర్వహిస్తూ ఎప్పుడూ పత్రికల వార్తల్లో వుండేట్లు చూసుకున్నాడు. ఓవైపు పత్రికల ప్రచారం, మరోవైపు శిరోమణి పలుకుబడి కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ ఏరియాలో అతడి పేరు ప్రస్తావనకొచ్చింది. డబ్బులేనివాడు ఎట్లా నెగ్గుకొస్తాడని పార్టీలోని కొంతమంది అడ్డు తగిలారు. “డబ్బు సంగతి నే చూసుకుంటా” అన్నాడు శిరోమణి. అతడి మనసులో అప్పటికే ఎన్నో పథకాలున్నాయి. శిరోమణి నమ్మకం వమ్ముకాలేదు. అప్పటి అధికార పార్టీ సీనియర్ నాయకుణ్ణే పైగా మంత్రినీ ఓడించాడు చెంగల్రెడ్డి. అతడి పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఎగస్పార్టీ మంత్రినే వోడించినందుకు చెంగల్రెడ్డికి ఎవరి సిఫార్సూ అవసరం లేకుండానే మంత్రి పదవి దక్కింది. ఒకే దెబ్బకి రెండు పదవులు వొచ్చిపడ్డాయి రెడ్డికి.

మంత్రి పదవి రావడంతో సొంత నియోజకవర్గం వాళ్ళు సొంత వూళ్ళోనే భారీ ఎత్తున అభినందన సభని ఏర్పాటు చేశారు. ఎవరైనా తమ కష్టాల్ని మంత్రిగారికి తెల్పుకోవచ్చుననీ, వాళ్ళ కష్టాల్ని మంత్రిగారు తీర్చేందుకు ప్రయత్నిస్తారనీ మైకుల్లో ప్రచారం చేశారు. రెడ్డికి పెద్దఎత్తున స్వాగతం లభించింది వూళ్ళోకి దిగడంతోటే. ముఖమే కన్పించలేదు పూలమాలల వర్షంలో. విశ్రాంతి కోసం నేరుగా రోడ్లు - భవనాల శాఖ అతిథి గృహానికి వెళ్ళాడు. తన తల్లీ, తమ్ముడూ ఆ వూళ్ళోనే ఉన్నారనే సంగతే జ్ఞాపకం రాలేదు అతడికి. మంత్రి వొచ్చాడని తెలీడంతోటే పత్రికా విలేకర్లు పరుగున వొచ్చారు. ఎంతో దర్పంగా వాళ్ళకి ఇంటర్వ్యూ ఇచ్చాడు.

సాయంత్రం సభ మొదలయ్యింది. చెంగల్రెడ్డి స్టేజి మీదికి ఎక్కి ఎక్కడంతోటే జిందాబాద్‌లు మిన్నుముట్టాయి. మంత్రిని అభినందిస్తూ కొంతమంది ప్రసంగించాక మైకందుకున్నాడు చెంగల్రెడ్డి.

“నన్ను గెలిపించి ఇంతవాణ్ణి చేసిన వాళ్ళకి పేరుపేరునా కృతజ్ఞతలు. మీ అభిమానం చూస్తుంటే మీ కోసం ఏమైనా, ఎంతటి త్యాగమైనా చేసెయ్యాలన్నంత వెర్రి ఆవేశం కల్గుతోంది. మీ సమస్యల్ని అవెంతటి కష్టమైనవైనా సరే తీర్చేయాలన్పిస్తోంది. నిజానికి వాటిని తీర్చడం నా ధర్మం కూడా. ఐతే కేవలం మీ సమస్యల్ని తీర్చడం తోటే నా కర్తవ్యం పూర్తి కాదు. పార్టీ ఫిరాయింపులు ఎంత ఈజీగా సాగిపోతున్నాయో మీకు తెలుసు. వాటిపై నేను యుద్ధాన్ని ప్రకటించడానికి సిద్ధమై ఉన్నానని మనవి చేస్తున్నాను. మొట్టమొదట ఓ పార్టీ తరఫున ఎన్నికైన అభ్యర్థి మరో పార్టీలో చేరాలనుకుంటే తన పదవికి రాజీనామా ఇచ్చి కొత్త పార్టీ తరఫున ఎన్నిక కావాలనే షరతు ఎంతైనా ముఖ్యం. లేదంటే తన పదవిని వొదులుకుని కొత్త పార్టీలో సాధారణ సభ్యుడిగా చేరాలి. అంతేగాని సొంత ఇష్టాయిష్టాల్నీ, అభిప్రాయాల్నీ ఓటువేసి గెలిపించిన మీ వంటి జనశక్తికి అంటగట్టడం మంచి పద్ధతి కాదని మీ తరఫున వాళ్ళకి నేను చెప్పదలచుకున్నాను. మీ తరఫున అట్లాంటి ఫిరాయింపుగాళ్ళ మీద పోరాటాన్ని చేస్తానని వాగ్దానం చేస్తున్నాను”

ఇక జనంలోంచి ఒకటే ఈలలు, చప్పట్లు, కేకలు. చాలాసేపటిదాకా అవి సద్దుమణగలేదు. చెంగల్రెడ్డి కూర్చున్నాక ప్రజా సమస్యల్ని మంత్రిగారికి విన్నవించవచ్చని నిర్వాహకులు ప్రకటించారు.

ఓ ఉప్పు వ్యాపారస్తుడు మైకు దగ్గరకి వొచ్చి “పదేళ్ళ క్రితం టెలిఫోన్ ఎక్స్ఛేంజి కోసమని పది సెంట్ల స్థలాన్ని నేను దానంగా ఇచ్చాను. ఐతే ఇంతదాకా ఆ స్థలంలో ఎక్స్ఛేంజి పడలేదు. ఎక్స్ఛేంజినయినా ఏర్పాటు చేయండి, లేదంటే నా స్థలాన్నయినా నాకిప్పించండి” అనడంతో మూడునెలల్లోగా ఎక్స్ఛేంజిని ఏర్పాటు చేయిస్తానని రెడ్డి హామీ ఇచ్చాడు. జనం హర్షధ్వానాలు చేశారు.

ఐదేళ్ళ క్రితం మార్కెట్ యార్డుని నిర్మిస్తే ఇంతదాకా దాన్ని ప్రారంభించలేదని, రైతులంతా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఓ రైతు నాయకుడు విన్నవించడంతోటే ‘ఈసారి వొచ్చినప్పుడు నేనే ఓపెన్ చేస్తా’నన్నాడు మంత్రి చెంగల్రెడ్డి. ఇట్లాంటివి, మరొకలాంటివి - సమస్యల్ని పరిష్కరించేస్తానని వాగ్దానాలు చేశాడు.

అప్పుడే ఓ ముసలావిడ తన సమస్య కూడా చెప్పుకుందామని స్టేజి వైపు నడవడం మొదలుపెట్టింది. “అయ్యా కాస్త తప్పుకోండి” అంటూ నెమ్మదిగా దారి చేసుకుంటూ ముందుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇంకో పాతిక గజాల దూరంలో ఉంది స్టేజి. మంత్రిగారికి సన్మానం అని అప్పుడే ప్రకటించారు. దండలు తెచ్చుకుని వున్నవాళ్ళంతా ఒక్కసారిగా ముందుకు తోసుకువచ్చారు. ముసలావిడ తన ప్రయత్నాన్ని మానకుండా ముందున్న వ్యక్తి భుజం పట్టుకుని అతన్ని దాటుతుంటే విసుక్కున్నాడతను.

“ఏమ్మా- ముసలిదానివి. ఎందుకట్లా ముందుకు తోసుకొస్తావ్? ఏం కావాలి?” అన్నాడతను.

“అయ్యా! నేను నా పెద్దబిడ్డ కోసం వెళ్తున్నాను. ఆ సంగతే చెప్పుకుందామని”

“ఎక్కడున్నాడు?”

“అదుగో ఆ స్టేజి మీదే”

“నీ కొడుకు పేరేంటమ్మా?”

“చెంగల్రెడ్డి”

“అది మా మంత్రిగారి పేరు కదా”

“నన్ను గెలిపించి ఇంతవాణ్ణి చేసిన వాళ్ళకి పేరుపేరునా కృతజ్ఞతలు. మీ అభిమానం చూస్తుంటే మీ కోసం ఏమైనా, ఎంతటి త్యాగమైనా చేసెయ్యాలన్నంత వెర్రి ఆవేశం కల్గుతోంది. మీ సమస్యల్ని అవెంతటి కష్టమైనవైనా సరే తీర్చేయాలన్పిస్తోంది. పార్టీ ఫిరాయింపులు ఎంత ఈజీగా సాగిపోతున్నాయో మీకు తెలుసు. వాటిపై నేను యుద్ధాన్ని ప్రకటించడానికి సిద్ధమై ఉన్నానని మనవి చేస్తున్నాను. మొట్టమొదట ఓ పార్టీ తరఫున ఎన్నికైన అభ్యర్థి మరో పార్టీలో చేరాలనుకుంటే తన పదవికి రాజీనామా ఇచ్చి కొత్త పార్టీ తరఫున ఎన్నిక కావాలనే షరతు ఎంతైనా ముఖ్యం. లేదంటే తన పదవిని వొదులుకుని కొత్త పార్టీలో సాధారణ సభ్యుడిగా చేరాలి. అంతేగాని సొంత ఇష్టాయిష్టాల్నీ, అభిప్రాయాల్నీ ఓటువేసి గెలిపించిన మీ వంటి జనశక్తికి అంటగట్టడం మంచి పద్ధతి కాదని మీ తరఫున వాళ్ళకి నేను చెప్పదలచుకున్నాను. మీ తరఫున అట్లాంటి ఫిరాయింపుగాళ్ళ మీద పోరాటాన్ని చేస్తానని వాగ్దానం చేస్తున్నాను”

“అవునయ్యా. వాడే నా బిడ్డ. నేను మీ మంత్రిగారి తల్లినే”

“ఆ...” అంటూ నోరు తెరిచాడా వ్యక్తి.

స్టేజిపైన మంత్రి చెంగల్రెడ్డి తలమీద పూలవర్షం, మెడలో మాలల వర్షం, నుదుటన సింధూర వర్షం కురుస్తున్నాయి.

ఎవరో సరస్వతిని విసురుగా తోయడంతో పట్టుతప్పిపోయి ముందుకు తూలి అక్కడున్న కుర్చీ మీద పడిపోయింది. నడుం కలుక్కుమంది.

స్టేజిపైన మంత్రిగారి సన్మానం ఘనంగా సాగుతోంది.

☆